సాక్షి నిర్మల్

శనివారం । 18 । మార్చి । 2023

అకాల వర్షం.. అపార నష్టం



జిల్లాలో అకాల వర్షానికి వరి, మొక్కజొన్న జొన్న పంటలు దెబ్బతిన్నాయి. విద్యుత్ స్తంభాలు విరిగి పడ్డాయి. మిర్చి, నువ్వు, వరి, శనగ, పొద్దుతిరుగుడు, పసుపు, సజ్జ పంటలకు నష్టం వాటిల్లింది. IIలో▸

పంచాయతీల నిర్వహణ ఎలా?



గ్రామపంచాయతీల అభివృద్ధికి అమలు చేస్తున్న పల్లెప్రగతి పథకాన్ని నిధుల కొరత వేధిస్తోంది. నెలనెలా నిధులు రాక పంచాయతీల నిర్వహణ ప్రశ్నార్థకంగా మారింది. IIలో▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం
27.3 / 18.1

ఆకాశం పూర్తిగా మేఘావృతమై ఉంటుంది. జిల్లాలోని చాలాప్రాంతాల్లో ఉరుములు, మెరుపులతో వర్షం కురిసే అవకాశం ఉంది. ఉష్ణోగ్రతలు తగ్గడంతో చలి పెరుగుతుంది.

న్యూస్‌రీల్

మంత్రిని కలిసిన మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్



నిర్మల్‌చైన్‌గేట్: నిర్మల్ మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్‌గా ఇటీవల బాధ్యతలు స్వీకరించిన జేవీడీఎస్.ప్రసాద్ శుక్రవారం జిల్లా కేంద్రంలోని మంత్రి నివాసంలో ఇంద్రకరణ్‌రెడ్డిని మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పూల మొక్క అందజేశారు. ఆయన వెంట జిల్లా ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ దేవేందర్ రెడ్డి, డాక్టర్ రజిని ఉన్నారు.

భైంసాలో ఆర్‌ఏఎఫ్ బలగాల కవాతు



భైంసాటౌన్: భైంసా పట్టణంలో ఆర్‌ఏఎఫ్ బలగాలు రెండోరోజూ శుక్రవారం కవాతు నిర్వహించాయి. సీఐ ఎల్.శ్రీను ఆధ్వర్యంలో పట్టణంలోని ప్రధాన వీధుల గుండా బలగాలు కవాతులో పాల్గొన్నాయి. శాంతిభద్రతల పరిరక్షణపై ప్రజల్లో నమ్మకం పెంచేందుకు కవాతు నిర్వహించినట్లు సీఐ తెలిపారు.

కుభీర్‌లో..

కుభీర్: మండల కేంద్రం కుభీర్‌లోని ప్రధాన వీధులతోపాటు, సున్నిత ప్రాంతాల్లో రాపిడ్ యాక్షన్ ఫోర్స్ బలగాలు శుక్రవారం కవాతు నిర్వహించాయి. ప్రజల్లో భయాందోళనలను దూరం చేసి వారిలో ధైర్యం నింపడానికే ఫ్లాగ్ మార్చ్ నిర్వహించామని సీఐ వినోద్‌రెడ్డి తెలిపారు. ప్రకృతి వైపరీత్యాలు వరదలు, భూకంపాలు సంభవించినప్పుడు ర్యాపిడ్ యాక్షన్ ఫోర్స్ సహాయం చేస్తుందన్నారు. 70 మంది ఏఆర్‌ఎఫ్ సిబ్బంది, 30 మంది పోలీసులు కవాతులో పాల్గొన్నారు. ఈ కవాతులో ఎస్సైలు ఎండీ. షరీఫ్, శ్రీకాంత్, సాయికిరణ్ పాల్గొన్నారు.

పేదలకు ఇళ్ల పట్టాలు ఇవ్వాలి

నిర్మల్‌చైన్‌గేట్: జీవో 58 ప్రకారం పేదలకు ఇళ్ల పట్టాలు ఇవ్వాలని సీపీఐఎం జిల్లా కార్యదర్శి బొమ్మెన సురేశ్ కోరారు. జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన జిల్లా కార్యవర్గ సమావేశంలో మాట్లాడారు. సొంత జాగా ఉన్నవారికి రాష్ట్ర ప్రభుత్వం గృహలక్ష్మి పథకం కింద రూ.5 లక్షలు, కేంద్రం ప్రభుత్వం రూ.10 లక్షలు ఇవ్వాలన్నారు. ప్రజాప్రతినిధులు, రియల్‌ఎస్టేట్ వ్యాపారులు కలిసి జిల్లాలో ప్రభుత్వ భూములను కబ్జాలు చేసి అమ్ముకుంటున్నారని, వాటికి పట్టాలు ఇవ్వొద్దని పేర్కొన్నారు. జిల్లాలో కొందరు నిర్మల్ చుట్టూ ఉన్న ప్రభుత్వ భూములను కబ్జా చేసి 59 జీవో ద్వారా క్రమబద్ధీకరణ కోసం దరఖాస్తు చేసుకున్నారని ఆరోపించారు. వాటిని క్రమబద్ధీకరించొద్దని సూచించారు. పేదలు, ఇళ్లులేనివారు గుడిసెలు వేసుకుంటే వాటిని 58 జీవో ప్రకారం క్రమబద్ధీకరించాలన్నారు. కార్యక్రమంలో పట్టణ కార్యదర్శి ఎస్.అరవింద్, కమిటీ సభ్యులు అదిక్ తదితరులు పాల్గొన్నారు.

న్యాయవాద పరిషత్ జిల్లా కమిటీ



నూతన కమిటీ సభ్యులు

నిర్మల్ టౌన్ : స్థానిక విశ్రాంత ఉద్యోగుల సంఘ భవనంలో న్యాయవాద పరిషత్ జిల్లా నూతన కమిటీని శుక్రవారం ఎన్నుకున్నారు. రాష్ట్ర అధ్యక్షుడు ప్రభాకర్‌రెడ్డి నూతన కమిటీని ప్రకటించారు. జిల్లా అధ్యక్షుడిగా సీనియర్ న్యాయవాది రాంచంద్రారెడ్డి, ఉపాధ్యక్షులుగా ఎస్. గంగాధర్, కొమ్మోజీ రమణ, ప్రధాన కార్యదర్శిగా ఎస్.నరేందర్, కోశాధికారిగా ఎస్.రాజును నియమించారు. ఈ సందర్భంగా పలువురు నూతన కమిటీకి అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర కోశాధికారి మంగునాయక్, సీనియర్ న్యాయవాది అంజుం కుమార్‌రెడ్డి, బీజేపీ సీనియర్ నాయకుడు అయ్యన్నగారి భూమయ్య తదితరులు పాల్గొన్నారు.

పరీక్షా కేంద్రాన్ని పరిశీలించిన డీఐఈవో

ముధోల్: మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల, గురుకుల పాఠశాలలో నిర్వహిస్తున్న ఇంటర్మీడియెట్ పరీక్షలను డీఐఈవో పరశురాములు శుక్రవారం పరిశీలించారు. విద్యార్థులకు అన్ని సౌకర్యాలు కల్పించాలని పరీక్ష కేంద్ర నిర్వాహకులకు సూచించారు. విద్యార్థులు ఎలాంటి భయం లేకుండా పరీక్షలు రాయాలని సూచించారు. విద్యార్థులకు అన్ని సౌకర్యాలు కల్పించాలని తెలిపారు.

పట్టాలెక్కనున్న ఇళ్లు!

- ఇళ్ల స్థలాల క్రమబద్ధీకరణకు లైన్‌క్లియర్
- 2022లో సవరించిన భూముల విలువల ప్రకారమే ఫీజు
- ఉత్తర్వులు జారీ చేసిన ప్రభుత్వం
- సర్కార్ స్థలాల్లో ఇళ్ల క్రమబద్ధీకరణకు ముందుకురాని ప్రజలు
- జిల్లాలో 59, 58 జీవోల కింద వచ్చిన దరఖాస్తులు 1,067 మాత్రమే..
- అత్యధికంగా భైంసాలో 888 దరఖాస్తులు



ముధోల్ నియోజకవర్గంలో ఇళ్ల పట్టాలు పంపిణీ చేస్తున్న కలెక్టర్ వరుణ్‌రెడ్డి, ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి

నిర్మల్‌చైన్‌గేట్: ప్రభుత్వ స్థలాల్లో ఇళ్లు నిర్మించుకుని క్రమబద్ధీకరణ కోసం ఎదురుచూస్తున్న వారికి పట్టాలు ఇచ్చేందుకు మార్గం సుగమమైంది. జీవో 58 ప్రకారం దరఖాస్తు చేసుకున్న వారిలో అర్హులను గుర్తించి పట్టాలు ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించింది. జీవో 59 ప్రకారం దరఖాస్తు చేసుకున్న వారిలో అర్హులకు పట్టాలు జారీ చేసేందుకు తగిన రిజిస్ట్రేషన్ ఫీజును 2022లో సవరించిన భూముల విలువల ప్రకారం చెల్లించాలా, అంతకుముందు ఉన్న భూముల విలువల ప్రకారం చెల్లించాలా అనే విషయమై పది నెలలుగా స్పష్టత కరువైంది. ఎట్టకేలకు 2022లో సవరించిన భూముల విలువల ప్రకారమే రిజిస్ట్రేషన్ ఫీజు చెల్లించాలని ఇటీవల నిర్వహించిన కేబినెట్ సమావేశంలో నిర్ణయించింది.

జిల్లాలో 1,067 దరఖాస్తులు..

ప్రభుత్వ స్థలాల్లో నిర్మించుకున్న ఇళ్లను క్రమబద్ధీకరించుకునేందుకు ప్రజల నుంచి ఆశించిన స్పందన రావడం లేదు. జిల్లాలో ఎలాంటి అభ్యంతరం లేని రెవెన్యూ, అర్బన్ ల్యాండ్ సీలింగ్ భూముల్లో దాదాపు 7 వేల వరకు ఇళ్లు ఉన్నా కేవలం 1,067 మంది మాత్రమే ఇళ్ల క్రమబద్ధీకరణ కోసం దరఖాస్తు చేసుకున్నారు. అందులో జీవో 59 ప్రకారం డబ్బులు చెల్లించి ఇళ్లను క్రమబద్ధీకరించుకునేందుకు 147 మంది మాత్రమే ముందుకొచ్చారు. ఇక, 125 గజాలలోపు ప్రభుత్వ స్థలంలో ఇళ్లను నిర్మించుకున్న వారికి ప్రభుత్వం జీవో 58 ప్రకారం ఉచితంగానే క్రమబద్ధీకరిస్తోంది. అలాంటి వారు జిల్లా వ్యాప్తంగా 920 మంది దరఖాస్తు చేసుకున్నారు. ఇక అంతకంటే ఎక్కువ స్థలంలో ఇళ్లను నిర్మించుకుని నివసిస్తున్న వారు వేల సంఖ్యలో ఉన్నా ఫీజు కోసం దరఖాస్తు చేసుకోలేదు.

మిగతా భూములపై వెలువడని నిర్ణయం..

అభ్యంతరం లేని రెవెన్యూ, అర్బన్ ల్యాండ్ సీలింగ్ స్థలాల్లో ఇళ్లను క్రమబద్ధీకరిస్తున్న ప్రభుత్వం అవి మినహా మిగతా 10 రకాల ప్రభుత్వ, ప్రభుత్వ శాఖలకు చెందిన భూముల్లో (అభ్యంతరకరమైనవిగా గుర్తించినవి) నిర్మించుకున్న ఇళ్ల క్రమబద్ధీకరణ విషయంలో మాత్రం ఎలాంటి నిర్ణయం తీసుకోలేదు. ఇందులో సాంఘిక సంక్షేమ శాఖ సేకరించిన భూములు, మున్సిపాలిటీల్లో ఇటీవల కలిసిన ఆబాది /గ్రామకంఠం భూములు, దేవాదాయ శాఖ భూములు, వక్ఫ్ భూములు, శిఖం/ఎఫ్‌ఏఎల్ భూములు, ఇతర ప్రభుత్వ శాఖల భూములు, ప్రభుత్వ లింక్ భూములు, నోటరీ ల్యాండ్స్, సాదాబైనామాలు, వీటిల్లో కవర్ కాని ఇతర భూముల్లో నిర్మించుకున్న ఇళ్ల వివరాలను కూడా సేకరించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇందులో భాగంగా రెవెన్యూ అధికారులు వాటి వివరాలను సేకరించారు.

125 గజాలలోపు ఉచిత పట్టా...

జీవో 58 ప్రకారం 125 గజాలలోపు భూమిని ఆక్రమించుకుని ఇళ్లు నిర్మించుకున్న వారికి ఉచితంగా క్రమబద్ధీకరించనున్నారు. అంతకు మించి భూమి ఉంటే.. వారు ప్రభుత్వం నిర్ణయించిన రుసుం చెల్లించాల్సి ఉంటుంది. 250 గజాలలోపు వారికి రిజిస్ట్రేషన్ ధరలో 50 శాతం 500 గజాలలోపు ఉంటే 75 శాతం, 500 గజాలకు పైబడిన వారి నుంచి 100 శాతం రుసుం వసూలు చేయనున్నారు. అర్హులకు పట్టాలు జారీచేసేందుకు కావాల్సిన పత్రాలను ఇప్పటికే తహసీల్దార్లకు పంపించారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు స్థానిక ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు పట్టాలు పంపిణీ చేయనున్నారు.

భైంసాలో ఎక్కువ దరఖాస్తులు..

ఇళ్ల స్థలాల క్రమబద్ధీకరణ కోసం అత్యధికంగా భైంసాలో జీవో 58 కింద 888 దరఖాస్తులు రాగా, అందులో 660 దరఖాస్తులు అధికారులు ఓకే చేశారు. మరో 179 దరఖాస్తులు తిరస్కరించారు.

జీవో 58 ప్రకారం దరఖాస్తులు

మండలం	దరఖాస్తులు	అప్రూవ్ అయినవి	రిజక్ట్ అయినవి	59 జీవోకు బదిలీ అయినవి
భైంసా	888	660	179	49
కుభీర్	30	24	6	0
సారంగపూర్	1	0	0	1
నిర్మల్ టౌన్	1	1	0	0

జీవో 59 ప్రకారం దరఖాస్తులు

మండలం	దరఖాస్తులు	అప్రూవ్ అయినవి	రిజక్ట్ అయినవి
భైంసా	143	90	53
బాసర	1	1	0
ముధోల్	2	2	0
సారంగపూర్	1	1	0

కటాఫ్ తేదీ మార్చిన ప్రభుత్వం..

రాష్ట్రంలో ఇళ్లు లేని పేదలకు ఇల్లు ఉండాలనే లక్ష్యంతో ప్రభుత్వం 58, 59 జీవోలను తీసుకొచ్చింది. మరోవైపు సొంతంగా ఇల్లు నిర్మించుకునే వారికి రూ.3 లక్షలు మూడు విడతల్లో ఇచ్చేలా గృహలక్ష్మి పథకాన్ని ప్రవేశపెట్టాలని నిర్ణయించింది. ఇందులో భాగంగా జీవో 59 ప్రకారం జిల్లా వ్యాప్తంగా మార్చి 10వ తేదీ వరకు 147 మంది మాత్రమే నిర్దేశిత ఫీజు చెల్లించి ఇళ్లను క్రమబద్ధీకరించుకునేందుకు ముందుకువచ్చారు. అయితే 2014 కటాఫ్ తేదీగా నిర్ధారించి ప్రభుత్వం గతంలో దరఖాస్తులు ఆహ్వానించింది. ఇప్పుడు తాజాగా కటాఫ్ తేదీని మార్చింది. ఇటీవల జరిగిన కేబినెట్ సమావేశంలో ఈ మేరకు నిర్ణయం తీసుకుంది. 2020 కటాఫ్ తేదీగా నిర్ణయించింది. అలాంటి వారంతా దరఖాస్తు చేసుకునేలా నెల రోజులు అవకాశం ఇవ్వనుంది. ఇక, ఇప్పటికే 58 జీవో ప్రకారం దరఖాస్తు చేసుకున్న వారి ఇళ్ల రెగ్యులరైజేషన్‌ను ఉచితంగా చేయడం ప్రారంభించింది. మరోవైపు 59 జీవో ప్రకారం డబ్బులు చెల్లించిన వారి రెగ్యులరైజేషన్ ప్రక్రియను ప్రారంభించింది. కటాఫ్ తేదీని మార్పు చేసి మళ్లీ దరఖాస్తు చేసుకునేందుకు నెల గడువు ఇవ్వడంతో దరఖాస్తుదారుల సంఖ్య పెరగవచ్చని అధికారులు భావిస్తున్నారు.

గ్రామాల అభివృద్ధే ధ్యేయంగా పనిచేయాలి

- కలెక్టర్ వరుణ్‌రెడ్డి



విద్యార్థులను ప్రశ్నలు అడుగుతున్న కలెక్టర్

కుంటాల: గ్రామాల అభివృద్ధే ధ్యేయంగా పనిచేయాలని కలెక్టర్ వరుణ్‌రెడ్డి సూచించారు. స్వచ్ఛ భారత్ మిషన్ కార్యక్రమంలో భాగంగా అంబకంటి తండాలో సర్పంచులకు, పంచాయతీ కార్యదర్శులకు, ఉపాధిహామీ, ఐకేపీ సిబ్బందికి శుక్రవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. గ్రామపంచాయతీల అభివృద్ధికి ఆర్థిక వనరులు పెంచుకోవాలని సూచించారు. తడి, పొడి చెత్తను వేరు చేసి సేంద్రియ ఎరువు తయారు చేయాలన్నారు. గ్రామాల్లో ట్రీగార్డుల్లో మొక్కలు లేవన, అవెన్యూ ప్లాంటేషన్ నిర్వహణ సక్రమంగా లేదని పేర్కొన్నారు. మార్చిలోగా ఉపాధిహామీ పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఎంపీడీవో దేవేందర్‌రెడ్డి, డీఎల్‌పీవో శివకృష్ణ, డీపీఆర్‌వో తిరుమల, ఏపీవో రహీం, సర్పంచులు పాల్గొన్నారు.

కలెక్టర్ సుడిగాలి పర్యటన...

మండలంలోని కల్లూర్, పెంచికల్‌పాడ్, కుంటాల, అంబకంటి గ్రామాల్లో కలెక్టర్ వరుణ్‌రెడ్డి సుడిగాలి పర్యటన చేశారు. కల్లూర్ ఎర్రకుంట చెరువులో పూడికతీత పనులను పరిశీలించారు. పెంచికల్‌పాడ్ పాఠశాలను సందర్శించి విద్యార్థులతో మాట్లాడారు. ప్రశ్నలు వేసి సమాధానాలు రాబట్టారు. ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు పెన్నులు, చాక్లెట్లు అందించి అభినందించారు. జిల్లాలో ఎక్కడా లేని విధంగా పాఠశాల కిచెన్ గార్డెన్‌లో 17 రకాల కూరగాయాలు పండిస్తున్న ప్రధానోపాధ్యాయుడు ఎల్లన్నను ప్రత్యేకంగా అభినందించారు. కుంటాల సొసైటీ కార్యాలయాన్ని తనిఖీచేసి రైతులకు రుణాలు, ఎరువులు సకాలంలో అందించాలని ఆదేశించారు. రేల బయో డిగ్రేడబుల్ శానిటరీ న్యాప్‌కిన్స్ తయారీ కేంద్రాన్ని సందర్శించి మహిళలకు సూచనలు చేశారు. వేసవి దృష్ట్యా గ్రామాల్లో తాగునీటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని, మిషన్‌భగీరథ ద్వారా నీరందించడంతోపాటు గ్రామాల్లో ప్రత్యేక టీంలు ఏర్పాటు చేసి మౌలిక వసతులు కల్పించాలని తెలిపారు. కలెక్టర్ వెంట డీఆర్డీవో విజయలక్ష్మి, డీపీఆర్వో తిరుమల, డీఎల్పీవో శివకృష్ణ, తహసీల్దార్ ఎంఏ.కలీం, ఎంపీడీవో దేవేందర్‌రెడ్డి, ఎంపీవో రహీం, సింగిల్‌విండో చైర్మన్ సట్ల గజ్జారాం, ఎంఈవో ముత్యం, ఏపీవో గట్టుపల్లి నవీన్, ఏపీఎం భోజన్న, సర్పంచులు పద్మబాయి, భోజాబాయి, సమత, జాదవ్‌శంకర్ తదితరులు పాల్గొన్నారు.

మక్కరైతు మోములో చిరునవ్వు

- ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర రూ.1,960
- బహిరంగ మార్కెట్‌లో క్వింటాల్ రూ.2,150 పైనే..
- హర్షం వ్యక్తం చేస్తున్న రైతులు



లక్ష్మణచాంద వద్ద మొక్కజొన్నలు బస్తాల్లో నింపుతున్న రైతులు

లక్ష్మణచాంద: ఆరుగాలం కష్టపడి పంటలు సాగు చేసిన అన్నదాతకు పంట చేతికి వచ్చిన సమయంలో సరైన ధర లేక, పెట్టుబడి కూడా రాక తీవ్రంగా నష్టపోయేవారు. కానీ ఈ యాసంగిలో జిల్లాలోని మొక్కజొన్న సాగు చేసిన రైతుల మోములో చిరునవ్వు కనిపిస్తోంది. ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధరకంటే ప్రైవేటు వ్యాపారులు ఎక్కువ చెల్లిస్తున్నారు. దీంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

జిల్లాలో 1.20 లక్షల ఎకరాల్లో సాగు..

జిల్లాలో ఈ వానాకాలం 24,251 ఎకరాలలో మొక్కజొన్న సాగు చేశారు. అధిక వర్షాలతో పంటలు దెబ్బతిన్నాయి. దీంతో యాసంగిలో మళ్లీ మొక్కజొన్నవైపు మొగ్గు చూపడంతో 1.20 లక్షల ఎకరాల్లో మొక్కజొన్నను సాగు చేశారు.

మంచి దిగుబడి..

జిల్లాలో ఈ యాసంగిలో సాగు చేసిన మొక్కజొన్న పంటకు మొదట్లో కత్తెర పురుగు ఆశించింది. వ్యవసాయాధికారులు సూచనలు, సలహాలు ఇవ్వడంతో తెగులు ఉధృతి తగ్గింది. మళ్లీ పంట ఆశాజనకంగా పెరిగింది. దీంతో దిగుబడి కూడా బాగానే వచ్చిందని రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ఎకరానికి 20–25 క్వింటాళ్ల దిగుబడి వచ్చిందని రైతులు పేర్కొంటున్నారు.

మద్దతు కన్నా మిన్న..

గతేడాది మొక్కజొన్న క్వింటాల్‌కు రూ.1,870 ఉండేది. ఈసారి దానిని కేంద్ర ప్రభుత్వం రూ.92 పెంచి రూ.1,962 చేసింది. ప్రస్తుతం జిల్లా అంతటా మొక్కజొన్న పంట చేతికి వచ్చింది. రైతులు పంటను కోసి హార్వెస్టర్లు, యంత్రాల సహాయంతో కంకులు పట్టించి అమ్మేందుకు సిద్ధం చేస్తున్నారు. ఈ క్రమంలో ప్రస్తుతం బహిరంగ మార్కెట్‌లో క్వింటాల్ మక్కల ధర మద్దతు రకంటే ఎక్కువ పలుకుతోంది. మద్దతు ధర రూ.1,962 ఉండగా, మార్కెట్‌లో రూ.2,100 నుంచి రూ.2,150 పలుకుతోంది. వ్యాపారులే రైతుల వద్దకు వచ్చి మద్దతు ధరకన్నా అధికంగా చెల్లించి కొనుగోలు చేస్తుండడంతో రైతులు వ్యాపారులకే విక్రయిస్తున్నారు.

వాతావరణంలో మార్పులతో ఆందోళన..

జిల్లా అంతటా మొక్కజొన్న పంట సాగు చేసిన రైతులకు పంట చేతికి వచ్చింది. కానీ బుధవారం నుంచి వాతావరణంలో మార్పులు వచ్చాయి. మబ్బులు కమ్మడంతో దళారులు ధరలు తగ్గిస్తారనే ఆందోళన రైతుల్లో నెలకొంది. జిల్లాలో వర్షం కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ ప్రకటించడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. వరుణుడు కరుణ చూపాలని వేడుకుంటున్నారు.

మంచి ధర ఉంది..

ఈ యాసంగిలో నేను రెండెకరాల్లో మొక్కజొన్న సాగు చేశాను. మద్దతు ధర రూ.1,962 ఉండగా, ప్రస్తుతం బహిరంగ మార్కెట్‌లో రూ.2,150 వరకు చెల్లిస్తున్నారు. వ్యాపారులు మంచి ధర చెల్లిస్తుండడం సంతోషంగా ఉంది.
– ఎద్దండి లచ్చన్న రైతు, లక్ష్మణచాంద

దిగుబడి, రేటు వచ్చింది

మొక్కజొన్న పంటను మొదటల్లో కత్తెర పురుగు ఆశించింది. దీంతో దిగుబడి తగ్గుతుందని ఆందోళన చెందాం. కానీ ఇప్పుడు మంచి దిగుబడికి తోడు, మంచి ధర కూడా వచ్చింది. ఎకరాకు పెట్టుబడి ఖర్చులు పోను రూ.15 వేలు మిగులుతున్నాయి. – బుచ్చన్న రైతు, లక్ష్మణచాంద

అభివృద్ధి, సంక్షేమమే సర్కారు ధ్యేయం



మాట్లాడుతున్న మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి

- రాష్ట్ర మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి

దిలావర్‌పూర్: గ్రామీణ ప్రాంతాల అభివృద్ధి, ప్రజల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని రాష్ట్ర అటవీ, దేవాదాయ, న్యాయ శాఖ మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి అన్నారు. మండలంలోని గుండంపల్లి గ్రామంలో ఇటీవల రూ.15 లక్షల వ్యయంతో చేపట్టిన ఆలయం పనులు పూర్తవడంతో ఆలయంలో కొనసాగుతున్న విగ్రహ ప్రతిష్టాపన మహోత్సవాలు నిర్వహిస్తున్నారు. శుక్రవారం మంత్రి హాజరై శిలాఫలకం ఆవిష్కరించి మాట్లాడారు. జిల్లాలో అనేక పురాతన ఆలయాల అభివృద్ధికి నిధులు కేటాయించి పునర్నిర్మిస్తున్నామని తెలిపారు. గుండంపల్లి గ్రామానికి మల్లన్న ఆలయంతోపాటుగా, స్థానికంగా ఇటీవల నిర్మాణం పూర్తయిన శ్రీవేంకటేశ్వర ఆలయానికి రూ.81 లక్షలు కేటాయించామన్నారు. భీమన్న ఆలయానికి రూ.10 లక్షలు, హనుమాన్ మందిరానికి రూ.35 లక్షలు మంజూరు చేశామని వివరించారు. గ్రామంలో రూ.50 లక్షలతో సీసీ రోడ్లు నిర్మిస్తున్నట్లు తెలిపారు. రెండు రోజులుగా మారిన వాతావరణ పరిస్థితుల కారణంతో వడగండ్ల వానలు కురిసి పంటలు దెబ్బతింటున్నాయన్నారు. నష్టం అంచనా వేయాలని వ్యవసాయ శాఖ అధికారులను అప్రమత్తం చేశామని పేర్కొన్నారు. ఈసందర్భంగా గొల్ల, కుర్మ సంఘం చైర్మన్ దైతు భోజన్న ఆధ్వర్యంలో మంత్రిని సన్మానించారు. స్థానిక సర్పంచ్ తక్కల సంగీత, ఎంపీపీ పాల్దె అక్షర, జెడ్పీటీసీ తక్కల రమణారెడ్డి, టీఆర్‌ఎస్ మండల కన్వీనర్ కె.చిన్నదేవేందర్‌రెడ్డి, ఏఎంసీ చైర్మన్ చిలుక రమణ, రైతుబంధు నాయకుడు చిన్నారెడ్డి, పీఏసీఎస్ ఉపాధ్యక్షుడు భోజన్న, పీఆర్ డీఈ తుకారాం, తహసీల్దార్ కరీం, ఎంపీడీవో మోహన్ రెడ్డి, ఎంపీవో అజీజ్‌ఖాన్, ఏవో స్రవంతి, ఏపీవో దివ్యారెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

పలుకరిస్తూ.. గోడు వింటూ

- అండగా ఉంటామని 'భట్టి' భరోసా
- జిల్లాలో రెండో రోజు 'పీపుల్స్ మార్చ్'
- నేడు ఖానాపూర్ నియోజకవర్గంలోకి..

సాక్షి,ఆదిలాబాద్/ఇచ్చోడ/సిరికొండ: ఆప్యాయంగా పలకరిస్తూ.. ప్రజా సమస్యలను ఓపిగ్గా వింటూ.. వారికి కాంగ్రెస్ అండగా ఉంటుందనే భరోసా కల్పిస్తూ ముందుకు కదిలారు సీఎల్పీ నేత మల్లు భట్టి విక్రమార్క. హాథ్‌సే హాథ్ జోడో అభియాన్ కొనసాగింపుగా జిల్లా మీదుగా చేపట్టిన పీపుల్స్ మార్చ్ పాదయాత్ర రెండో రోజు కొనసాగింది. బోథ్ నియోజకవర్గంలోని ఇచ్చోడ, సిరికొండ మండలాల్లోని గ్రామాల మీదుగా 17 కిలోమీటర్ల మేర సాగింది. బజార్‌హత్నూర్ మండలం పిప్రి వద్ద గురువారం యాత్ర ప్రారంభమైన విషయం తెలిసిందే. రాత్రి ఇచ్చోడలో బస చేశారు. శుక్రవారం ఉదయం 10 గంటల సమయంలో యాత్ర షురూ చేశారు. దుబార్‌పేట్, పట్వారిగూడ, మాధాపూర్, పొన్న, రాయిగూడ, సుంకిడి, జాకిర్‌గూడ మీదుగా సిరికొండకు సాయంత్రం చేరుకుంది.

సమస్యలను ఆలకించారు..

మాజీ ఎమ్మెల్సీ ప్రేమ్‌సాగర్‌రావు అధ్యక్షతన పాదయాత్ర సాగుతుంది. జిల్లా అధ్యక్షుడు సాజిద్‌ఖాన్, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి గండ్రత్ సుజాత, బోథ్ నియోజకవర్గ నేతలు వెన్నెల అశోక్, ఆడె గజేందర్, ఇతర నేతలు వెంట నడిచారు. ఉమ్మడి జిల్లా నుంచి పెద్ద ఎత్తున కార్యకర్తలు తరలివచ్చారు. ఇచ్చోడ బస్టాండ్ వద్ద రోడ్డు పక్కన చెప్పులు కుడుతున్న వ్యక్తిని భట్టి పలకరించారు. సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అలాగే ఆటోడ్రైవర్ షేక్ జావిద్, కూరగాయలు విక్రయించే షేక్ మోయిజ్‌లు భట్టితో సమస్యలపై ఏకరువు పెట్టారు. దుబార్‌పేట్‌లో ప్రజలు స్వాగతం పలికి తమ గోడు వినిపించారు. భారీ వర్షాలు కురిసినప్పుడు వరదలతో గ్రామం మునిగిందని, పునరావాస చర్యలు ఇప్పటివరకు సరిగ్గా అందలేదని తెలిపారు. గ్యాస్ ధర పెరిగి కొనలేని పరిస్థితిలో కట్టెలు తెచ్చుకుందామని అడవికి పోతే అటవీ అధికారులు అడ్డుకుంటున్నారని, తామెట్ల బతికేదని దేశ్‌ముఖ్ సుగుణబాయి భట్టితో ఆవేదన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే సమస్యల పరిష్కారం కోసం తనవంతుగా పూర్తి ప్రయత్నం చేస్తానని సీఎల్పీ నేత వివరించారు. పట్వారిగూడలో ప్రాథమిక పాఠశాలను సందర్శించారు. బడిని అభివృద్ధి చేసే విషయంపై ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని గ్రామస్తులకు హామీ ఇచ్చారు. మాదాపూర్ గ్రామంలో పేదలు తాము నివసిస్తున్న ఇళ్లను భట్టికి చూయించారు. దరఖాస్తు చేసుకున్నప్పటికీ డబుల్ బెడ్‌రూం ఇళ్లు రాలేదని ఆయన దృష్టికి తీసుకెళ్లారు. కాంగ్రెస్ ప్రభుత్వం రాగానే ఇలాంటి పేద వారి కోసం ఇల్లు కట్టుకోవడానికి రూ.5లక్షలు ఇస్తామని భరోసానిచ్చారు. ఆ సందర్భంలో గ్రామస్తులు కాంగ్రెస్ పార్టీ జిందాబాద్ అంటూ నినాదాలు చేశారు.



సమస్యలు తెలుసుకుంటున్న భట్టివిక్రమార్క

నేడు ఖానాపూర్ నియోజకవర్గంలోకి ప్రవేశం..

బోథ్ నియోజకవర్గంలో రెండు రోజుల పాటు సాగిన పాదయాత్ర శనివారం ఖానాపూర్ నియోజకవర్గానికి చేరుకోనుంది. శుక్రవారం రాత్రి సిరికొండలో బస చేసిన భట్టి శనివారం ఉదయం 7గంటల నుంచే పాదయాత్ర మొదలుపెట్టనున్నారు. దస్నాపూర్ మీదుగా ఖానాపూర్ నియోజకవర్గంలోని ఇంద్రవెల్లికి చేరుకుంటారు. పాదయాత్ర అనంతరం రాత్రి కార్నర్ సమావేశంలో పాల్గొంటారు. ఆ రాత్రి అక్కడే బస చేస్తారు.

క్లుప్తంగా

'ఎమ్మెల్సీ ఫలితం బీఆర్‌ఎస్‌కు చెంపపెట్టు'

ఆదిలాబాద్: హైదరాబాద్–రంగారెడ్డి–మహబూబ్‌నగర్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీ బలపరిచిన అభ్యర్థి ఏవీఎన్ రెడ్డి ఘనవిజయం సాధించడం బీఆర్‌ఎస్‌కు చెంపపెట్టు లాంటిదని ఎంపీ సోయం బాపూరావు ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల ఫలితాలు సీఎం కేసీఆర్ ప్రభుత్వాన్ని కోలుకోలేని దెబ్బతీశాయని పేర్కొన్నారు. పట్టభద్రులు, మేధావులు, నిరుద్యోగులు బీఆర్‌ఎస్ ప్రభుత్వంపై వ్యతిరేకంగా ఉన్నారనడానికి ఈ విజయమే నిదర్శనమని తెలిపారు. ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో రాష్ట్రంలో సుస్థిరమైన బీజేపీ ప్రభుత్వం ఏర్పాటవుతుందని దీమా వ్యక్తంజేశారు. రాష్ట్రంలో టీఎస్‌పీఎస్సీ ప్రశ్నాపత్రాల లీకేజీ వ్యవహారంలో బీఆర్‌ఎస్ బడా నేతల హస్తముందని ఆరోపించారు. నిరుద్యోగుల ఉసురు రాష్ట్ర ప్రభుత్వానికి తగులుతుందని మండిపడ్డారు. టీఎస్‌పీఎస్సీ ప్రశ్నాపత్రాల లీకేజీ వ్యవహారం తెలంగాణ సమాజాన్ని తలదించుకునేలా చేసిందని తెలిపారు. నిందితులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. సీఎం కేసీఆర్ కూతురు, ఎమ్మెల్సీ కవిత ఈడీ విచారణకు గైర్హాజరవుతూ లిక్కర్ స్కాం నుంచి తప్పించుకునేలా జిమ్మిక్కులు చేస్తున్నారని విమర్శించారు.

ఉద్యమకారుల ఫోరం చైర్మన్‌గా శేఖర్


కొట్టె శేఖర్

నిర్మల్‌చైన్‌గేట్: తెలంగాణ ఉద్యమకారుల ఫోరం ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా చైర్మన్‌గా జిల్లా కేంద్రానికి చెందిన కొట్టె శేఖర్‌ను నియమించినట్లు తెలంగాణ ఉద్యమకారుల పురం రాష్ట్ర కమిటీ చైర్మన్ చీమ శ్రీనివాస్ తెలిపారు. ఈ మేరకు శుక్రవారం నియామకపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా శేఖర్ మాట్లాడుతూ.. తెలంగాణ ఉద్యమకారుల సంక్షేమ బోర్డు ఏర్పాటుకు తనవంతు కృషి చేస్తానని చెప్పారు. ఉద్యమకారుల ఐక్యతకు ఎల్లవేళలా పని చేస్తానని పేర్కొన్నారు.

ఆయిల్‌పామ్ సాగు ఆదర్శం


మొక్కను పరిశీలిస్తున్న వెంకట్రాంరెడ్డి

పెంబి: మండల కేంద్రానికి చెందిన పాకల ఫౌండేషన్ చైర్మన్ పాకల రాంచందర్ ఆయిల్ పామ్ సాగు చేయడం ఆదర్శనీయమని తెలంగాణ రాష్ట్ర మాజీ ఉద్యానవన శాఖ కమిషనర్ వెంకట్రాంరెడ్డి అన్నారు. శుక్రవారం రాంచందర్ సాగు చేసిన ఆయిల్‌పామ్ తోటలు పర్యవేక్షించి మాట్లాడారు. దేశంలోనే ఆయిల్‌పామ్ సాగులో తెలంగాణ రాష్ట్రం మొదటి స్థానంలో ఉందని, దీనికి కారణం సీఎం కేసీఆర్ ప్రోత్సాహమేనన్నారు. మలేషియా, ఇండోనేషియా ఆఫ్రికా దేశాల్లో ఆయిల్‌పామ్ సాగు చేసేవారని, మారుమూల గ్రామంలో పెంబి మండలంలో ఇలా ఆయిల్‌పాం సాగు చేయడం పలువురి రైతులకు ఆదర్శంగా నిలుస్తున్నారని పాకల రాంచందర్‌ను అభినందించారు. మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి చొరవతో పాక్‌పట్ల సమీపంలో ఆయిల్‌పామ్ ఫాక్టరీ నెలకొల్పినట్లు తెలిపారు. ఆయిల్‌పామ్ సాగుకు రైతులు ముందుకు రావాలని సూచించారు. సర్పంచ్ పూర్ణచందర్‌గౌడ్, వెంకట్రాంరెడ్డి సతీమణి రాగలత, రైతులు లింగారెడ్డి, భీముడు తదితరులున్నారు.


లోకేశ్వరం: నేలకొరిగిన మొక్కజొన్న


లోకేశ్వరం: ధర్మోరలో కల్లంలో తడిసిన మొక్కజొన్న


దిలావర్‌పూర్: సముందర్‌పల్లిలో నేలవాలిన మొక్కజొన్న


ముధోల్: ఆష్టాలో నేలకొరిగిన మొక్కజొన్న

అకాల వర్షం.. అపార నష్టం

లోకేశ్వరం: మండలంలోని జోహర్‌పూర్, అబ్దుల్లాపూర్, రాయపూర్‌కాండ్లీ, దర్మోరా, పంచగుడి, పిప్రి, వట్టోలి, అర్లిగొడిసెరా, నగర్, గడ్‌చాంద తదితర గ్రామాల్లో గురువారం రాత్రి ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసింది. వరి, మొక్కజొన్న, జొన్న చేలు నేలకొరిగాయి. ఈదురు గాలులకు విద్యుత్ స్తంభాలు విరిగి నేలకొరగగా కరెంట్ సరఫరాలో కొద్దిసేపు అంతరాయమేర్పడింది. వర్షానికి మొక్కజొన్న, మిర్చి, నువ్వు, వరి, శనగ, పొద్దుతిరుగుడు, పసుపు, సజ్జ పంటలు దెబ్బతిన్నాయి. కల్లాల్లో ఆరబెట్టిన పసుపు, మొక్కజొన్న ధాన్యం తడిసి ముద్దయింది. పసుపు, మొక్కజొన్నను కాపాడుకునేందుకు రైతులు నానా కష్టాలు పడ్డారు. పంట నష్టపోయిన తమకు పరిహారం చెల్లించాలని రైతులు కోరుతున్నారు.

పంట నష్టంతో రైతుల విలవిల

దిలావర్‌పూర్: అహర్నిషలు కష్టించి పంటలు సాగు చేస్తున్న రైతాంగం అకాల వర్షాలతో ఉక్కిరిబిక్కిరవుతున్నారు. దిలావర్‌పూర్, గుండంపల్లి, కాల్వ, సముందర్‌పల్లి, బన్సపల్లి తదితర గ్రామాల్లో రెండురోజులుగా బలమైన గాలులతో కూడిన వాన కురిసింది. గురువారం అర్ధరాత్రి బలమైన గాలులతో కురిసిన వర్షానికి మొక్కజొన్నకు పెద్ద ఎత్తున నష్టం వాటిల్లింది. ఈ రబీలో మండల వ్యాప్తంగా 4,500 ఎకరాల్లో మొక్కజొన్న సాగు చేస్తున్నారు. ఇందులో ఇప్పటివరకు వెయ్యి ఎకరాలవరకు పంట తుదిదశలో ఉండగా మిగతా విస్తీర్ణంలో సాగవుతున్న పంట మధ్యస్థదశలో ఉంది. కాగా, వాతావరణ పరిస్థితులు ఒక్కసారిగా మారి వడగళ్ల వానలు కురుస్తుండడంతో పంట చేతికి వస్తుందో.. లేదోనని రైతులు బెంబేలెత్తి పోతున్నారు. అకాల వర్షాలకు దెబ్బతిన్న పంటలపై ప్రభుత్వం సర్వే చేయించి తమకు పరిహారం అందించి ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.

ముధోల్ మండలంలో..

ముధోల్: మండల కేంద్రంతోపాటు వివిధ గ్రామాల్లో గురువారం రాత్రి వీచిన ఈదురుగాలులకు పంట నష్టం జరిగింది. ఆష్టా గ్రామానికి చెందిన రైతు మొగులాజీకి చెందిన మొక్కజొన్న పూర్తిగా నేలకొరిగింది. సుమారు రూ.70వేల నష్టం జరిగినట్లు బాధితుడు తెలిపాడు. పలు గ్రామాల్లో జొన్న పంట పూర్తిగా నేలమట్టమైంది.

పంచాయతీల నిర్వహణ ఎలా?



తాళ్లపేట గ్రామపంచాయతీ కార్యాలయం

ఉమ్మడి జిల్లాలోని గ్రామ పంచాయతీల వివరాలు

జిల్లా	గ్రామపంచాయతీలు
మంచిర్యాల:	310
నిర్మల్:	396
ఆదిలాబాద్:	468
కుమురంభీం:	335

దండేపల్లి: గ్రామపంచాయతీల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పల్లెప్రగతి పథకాన్ని నిధుల కొరత వేధిస్తోంది. నెలనెలా నిధులు విడుదల చేయకపోవడంతో పంచాయతీల నిర్వహణ ప్రశ్నార్థకంగా మారింది. ప్రతీ నెల ఎంపీడబ్ల్యూల వేతనాలు, కరెంట్ బిల్లులు, పంచాయతీ ట్రాక్టర్ల కిస్తుల చెల్లింపుతోపాటు ట్రాక్టర్ నిర్వహణకు కొంత మొత్తాన్ని వెచ్చించాల్సి ఉంటుంది. రాష్ట్ర ఆర్థిక సంఘం నిధులు (ఎస్‌ఎఫ్‌సీ) ఆరు నెలలుగా విడుదల చేయడంలేదు. జనరల్ ఫండ్‌ను వినియోగించుకునేందుకు జారీ చేసిన చెక్కులు నెలల తరబడి పాస్‌కావడం లేదు. ఖాతాల్లో ఉన్న ఎస్‌ఎఫ్‌సీ నిధులు వినియోగించుకుందామంటే చెక్కులు జనరేట్ కావడం లేదు. దీంతో పంచాయతీల నిర్వహణకు సర్పంచులు, పంచాయతీ సిబ్బంది ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

- ఆర్నెళ్లుగా అందని నిధులు
- కుంటుపడుతున్న అభివృద్ధి
- ఇబ్బందుల్లో పాలకవర్గాలు

ఎస్‌ఎఫ్‌సీ నిధులతో కాలం వెల్లదీత

కొద్దిపాటిగా వస్తున్న 15వ ఆర్థిక సంఘం (ఎఫ్‌ఎఫ్‌సీ) నిధులతో పంచాయతీ పాలకవర్గాలు కాలం వెల్లదీస్తున్నాయి. నెలనెలా ఎస్‌ఎఫ్‌సీ నిధులు సక్రమంగా మంజూరు కావడంలేదు. ఉన్న నిధులు ఖర్చు చేద్దామంటే చెక్కులు జనరేట్ కాని పరిస్థితి ఉంది. జనరల్ ఫండ్‌కు సంబంధించిన చెక్కులు కూడా పాస్ కావడంలేదు. కొన్ని చోట్ల మల్టీపర్పస్ వర్కర్లకు వేతనాల చెల్లింపుల్లో ఆలస్యమవుతోంది. పైగా పంచాయతీ ట్రాక్టర్ల నిర్వహణ తలకు మించిన భారమవుతోందని పలువురు సర్పంచులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం స్పందించి, పంచాయతీల అభివృద్ధి, నిర్వహణకు సంబంధించి ఎస్‌ఎఫ్‌సీ నిధులు నెలనెలా జమచేయాలని కోరుతున్నారు. నిధులు ఖర్చు చేసుకునేందుకు జారీ చేసిన చెక్కులు పాస్ అయ్యేలా చూడాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

చాలా ఇబ్బందవుతోంది.



ప్రభుత్వం పంచాయతీల నిర్వహణకు నెలల తరబడి నిధులు మంజూరు చేయడంలేదు. దీంతో చాలా ఇబ్బందవుతోంది. ట్రాక్టర్ల నిర్వహణ, మల్టీపర్పస్ వర్కర్ల వేతనాల చెల్లింపునకు చాలా కష్టమవుతోంది. పంచాయతీ నిర్వహణ భారమవుతోంది. నెలనెలా నిధులు విడుదల చేయాలి. ఉన్న నిధులు ఖర్చు చేసుకునేందుకు జారీ చేసిన చెక్కులు పాసయ్యేలా చూడాలి.

– అనవేని ప్రేమల, సర్పంచ్, నాగసముద్రం

ప్రభుత్వానికి వివరాలు పంపిస్తున్నాం

ఎస్‌ఎఫ్‌సీ, జీపీల జనరల్ ఫండ్ నిధులు ఖర్చు చేసుకునేందుకు ప్రభుత్వ ఆమోదం రానందున చెక్కులు పాస్‌కావడం లేదు. వివరాలు ప్రభుత్వానికి పంపిస్తున్నాం. చెక్కులు పాస్ కాకపోవడంతో చిన్నచిన్న పంచాయతీలకు ఇబ్బందులు తలెత్తుతున్నాయి. అయినప్పటికీ ప్రత్యామ్నాయ ఏర్పాట్లతో ఇబ్బందులు అధిగమిస్తున్నాం. త్వరలోనే సమస్య తీరిపోతుంది.

– వెంకటేశ్వర్‌రావు, డీపీవో, మంచిర్యాల

గంజాయి విక్రేతల అరెస్టు


నిందితులతో ఎక్సైజ్ పోలీసులు

ఆర్మూర్‌టౌన్: నిజామాబాద్ జిల్లా బాల్కొండ మండలం పోచంపాడ్ గ్రామంలో గంజాయి విక్రయిస్తున్న ముగ్గురిని అదుపులోకి తీసుకున్నట్లు ఎక్సైజ్ సీఐ స్టీవెన్‌సన్ తెలిపారు. ఆర్మూర్‌లోని ఎక్సైజ్ కార్యాలయంలో శుక్రవారం వెల్లడించారు. శుక్రవారం ఉదయం పోచంపాడ్ ప్రాజెక్ట్ సమీపంలోని ఒక షెడ్డులో గంజాయి విక్రయిస్తున్నారని సమాచారం రావడంతో ఎక్సైజ్ పోలీసులు దాడులు చేశారు. కల్యాణ్, సంతోష్‌లను అదుపులోకి తీసుకున్నారు. వీరికి గంజాయి సరఫరా చేసిన నిర్మల్‌కు చెందిన రాజ్‌కుమార్‌ను సైతం అదుపులోకి తీసుకున్నారు. 230 గ్రాముల గంజాయి, రెండు బైక్‌లను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు సీఐ పేర్కొన్నారు. దాడుల్లో సబ్ ఇన్‌స్పెక్టర్ ఏ.గంగాధర్, సిబ్బంది వికాస్‌గౌడ్, నరేశ్, దేవిదాస్, మోహన్, సందీప్, సాయిలు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

భైంసాటౌన్: లింగా గ్రామ సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. భైంసా పట్టణంలోని గణేశ్‌నగర్‌కు చెందిన గజ్జారాంతోపాటు కుభీర్ మండలం సాప్లి గ్రామానికి చెందిన సదాశివ్ ఘటనాస్థలంలో తీవ్రగాయాలతో కనిపించారు. స్థానికులు 108కు సమాచారమిచ్చారు. క్షతగాత్రులను భైంసా ఏరియాస్పత్రికి తరలించారు. ఘటనాస్థలంలో ఒకే ద్విచక్రవాహనం ఉండడంతో ప్రమాదం ఎలా జరిగిందనే విషయం తెలియరాలేదు.

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక


ఎంపికైన క్రీడాకారులతో సభ్యులు, శిక్షకులు

ఆదిలాబాద్: జిల్లాస్థాయి మహిళల ఖేలో ఇండియా అథ్లెటిక్స్ ఎంపిక పోటీల్లో ప్రతిభ కనబరిచిన 23 మంది క్రీడాకారులు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు అథ్లెటిక్స్ అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి రాజేశ్ తెలిపారు. ఈ మేరకు జిల్లా కేంద్రంలోని ఇందిరాప్రియదర్శిని స్టేడియంలో శుక్రవారం క్రీడాకారుల అభినందన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రాజేశ్ మాట్లాడుతూ.. రాష్ట్రస్థాయి పోటీలు హైదరాబాద్‌లోని గోల్కొండ ఆర్టిల్లరీ సెంటర్లో ఈ నెల 19వ తేదీన ప్రారంభం కానున్నట్లు పేర్కొన్నారు. రాష్ట్రస్థాయిలో జిల్లా క్రీడాకారులు రాణించేలా ప్రత్యేక శిక్షణ ఇచ్చినట్లు వెల్లడించారు. పెటా సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి స్వామి మాట్లాడుతూ.. రాష్ట్ర స్థాయి పోటీల్లో సత్తా చాటి జిల్లా పేరు నిలుపాలని సూచించారు. కార్యక్రమంలో శిక్షకులు వీజీఎస్ రాకేశ్, జ్యోతిస్వరణ్ ఉన్నారు.

ఉట్నూర్ ఎస్సైకి స్వర్ణోత్సవ మెడల్



భరత్‌సుమన్‌కు మెడల్ అందజేస్తున్న ఎస్పీ

ఉట్నూర్‌రూరల్: ఉట్నూర్ ఎస్సైగా విధులు నిర్వహిస్తున్న భరత్‌సుమన్‌కు స్వతంత్ర భారత స్వర్ణోత్సవ మెడల్‌ను ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి అందజేశారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని ఎస్పీ కార్యాలయంలో పోలీస్ విభాగంలో అత్యుత్తమ ప్రతిభ చూపిన వారికి స్వర్ణోత్సవ మెడల్స్‌ను అందించారు. అందులో భాగంగా ఉట్నూర్ ఎస్సైని ఎస్పీ అభినందించారు. తనకు స్వర్ణోత్సవ మెడల్ రావడం సంతోషంగా ఉందని సుమన్ అన్నారు. ఎస్సైకి మండల ప్రజాప్రతినిధులు, అధికారులు, స్థానికులు శుభాకాంక్షలు తెలియజేశారు.

చెంతనే ప్రాజెక్ట్.. చెలిమెనీరే దిక్కు


సుద్దవాగు ఒడ్డునున్న చెలిమెలోంచి నీటిని తోడుతున్న మహిళ

భైంసాటౌన్: సముద్రంలో నీరెంత ఉన్నా.. తాగడానికి పనికి రాదన్నట్లు.. పక్కనే వాగులో నీరున్నా.. చెలిమె నీరే ఇక్కడి ప్రజల దాహం తీర్చుతోంది. నిర్మల్ జిల్లా భైంసా పట్టణశివారులో సుద్దవాగుపై గడ్డెన్నవాగు ప్రాజెక్టు నిర్మించిన విషయం తెలిసిందే. కొంతమంది మహారాష్ట్రవాసులు ఇక్కడికి వలస వచ్చి ప్రాజెక్ట్ సమీపంలో వాగు ఒడ్డున గుడిసెలు వేసుకుని నివసిస్తున్నారు. అక్కడే ఉంటూ ప్రాజెక్ట్‌లో చేపలు పడుతూ జీవనం వెల్లదీస్తున్నారు. అయితే, వాగులో నీరు తాగేందుకు పనికిరాదని, వాగు ఒడ్డునే ఇలా చెలిమె తవ్వి నీటిని తోడుకుంటున్నారు.

బౌద్ధ భిక్షువులను పిలిపించాలి


మంత్రికి వినతిపత్రం ఇస్తున్న బౌద్ధ మహాసభ సభ్యులు

నిర్మల్ టౌన్: హైదరాబాదులో ప్రతిష్ఠించిన 125 అడుగుల అంబేద్కర్ విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమానికి బౌద్ధ భిక్షువులను పిలిపించాలని భారతీయ బౌద్ధ మహాసభ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు ప్రభాకర్ కోరారు. ఈ సందర్భంగా జిల్లా కేంద్రంలోని మంత్రి క్యాంపు కార్యాలయంలో శుక్రవారం మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. అంబేద్కర్ విగ్రహ భూమిపూజ కార్యక్రమానికి బౌద్ధ భిక్షువులను పిలువలేదని తెలిపారు. ప్రతిష్ఠాపన కార్యక్రమానికైనా వారిని పిలిపించాలని కోరారు. ప్రధాన కార్యదర్శి గంగాధర్ తదితరులున్నారు.

వైద్యం వికటించి యువకుడి మృతి

ఆదిలాబాద్‌టౌన్: జైనథ్ మండలం దీపాయిగూడకు చెందిన వినోద్(22) వైద్యం వికటించి మృతిచెందాడు. తల్లి సునీత వివరాల ప్రకారం.. వినోద్ కొన్ని రోజులుగా కిడ్నీ సమస్యతో బాధపడుతున్నాడు. గురువారం జిల్లా కేంద్రంలోని రిమ్స్‌లో చేర్పించారు. శుక్రవారం మధ్యాహ్నం పండ్లు తిని విశ్రాంతి తీసుకున్నాడు. ఆ సమయంలో రిమ్స్‌లో పని చేస్తున్న స్టాఫ్ నర్సు వచ్చి విధిగా ఇంజక్షన్ వేసింది. అనంతరం కొద్ది సేపటికే వినోద్ వాంతులు చేసుకుని అపస్మారక స్థితికి వెళ్లిపోయాడు. అక్కడి నర్సులకు విషయం తెలుపగా వార్డులో వైద్యులు ఎవరూ లేరని బదులిచ్చారు. కొంతసేపటికి వినోద్‌ను రిమ్స్‌లోని ఎంఐసీయూ వార్డుకు తరలించారు. కొద్ది సమయం తర్వాత వినోద్ మృతిచెందినట్లు వైద్యులు తెలిపారు. ఆ సమయంలో వైద్యులుంటే తన కుమారుడు ప్రాణాలు దక్కేవని తల్లి కన్నీరు మున్నీరైంది. దీనిపై రిమ్స్ డైరెక్టర్ వివరణ కోరేందుకు ఫోన్‌లో ప్రయత్నించగా ఆయన అందుబాటులోకి రాలేదు.

కార్మికులను పర్మినెంట్ చేయాలి

రెబ్బెన(ఆసిఫాబాద్): బెల్లంపల్లి ఏరియాలో డిప్యూటేషన్‌పై పని చేస్తున్న కార్మికులను పర్మినెంట్ చేయాలని హెచ్ఎంఎస్ ఏరియా ఉపాధ్యక్షుడు పత్తెం రాజాబాబు కోరారు. శుక్రవారం గోలేటి సీహెచ్‌పీలో ఇన్‌చార్జి డీజీఎం రాజుకు వినతిపత్రం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఏరియా ఆస్పత్రిలో పని చేస్తున్న కొంతమంది కార్మికులను గోలేటి సీహెచ్‌పీకి డిప్యూటేషన్‌పై పంపించారని తెలిపారు. అయితే ముడుపులు అప్పజెప్పిన కొంతమందిని మాత్రం ఏరియా ఆస్పత్రిలో అవసరం లేకుండా ఉంచుకున్నారని పేర్కొన్నారు. ఏరియాలో అనేక సర్ఫేస్ మజ్దూర్ పోస్టులు ఖాళీగా ఉన్నాయని, ఇక్కడ పని చేస్తున్న కార్మికులకు ప్రమోషన్లు కల్పిస్తూ ఖాళీలను భర్తీ చేయాలన్నారు. పిట్ కార్యదర్శి ఆరీఫ్, అసిస్టెంట్ పిట్ కార్యదర్శి ఉమామహేశ్వర్, ఏరియా ఆర్గనైజర్లు దత్తు, షిప్ట ఇన్‌చార్జి కిష్టస్వామి పాల్గొన్నారు.

పీడీఎస్ బియ్యం బహిరంగ వేలం

పాతమంచిర్యాల: పౌరసరఫరాలశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన తనఖీల్లో పట్టుకున్న వెయ్యి 156క్వింటాళ్ల పీడీఎస్ బియ్యాన్ని ఈ నెల 18న ఉదయం 11గంటలకు కలెక్టర్ భవన సముదాయంలో అదనపు కలెక్టర్ (పౌర సరఫరాలు) చాంబర్‌లో బహిరంగ వేలం నిర్వహించనున్నట్లు అదనపు కలెక్టర్ (పౌరసరఫరాలు) డీ మధుసూదన్‌నాయక్ తెలిపారు. వేలంలో పాల్గొనేవారు రూ.2.50 లక్షల డిపాజిట్ సొమ్మును 'జిల్లా పౌరసరఫరాల అధికారి' పేరిట డీడీ తీసీ వేలంలో పాల్గొనాల్సి ఉంటుందని పేర్కొన్నారు. వేలం ముగిసిన అనంతరం డీడీ సొమ్ము తిరిగి చెల్లించబడుతుందని చెప్పారు. వేలంలో పాల్గొనే వారు ప్రత్యక్షంగా గాని, పరోక్షంగా గాని పీడీఎస్ బియ్యం, చక్కెర, గోధుమలు వ్యాపారం చేసేవారు, లేదా రైస్‌మిల్లర్లు గాని ఉండరాదన్నారు. బహిరంగ వేలంలో ఎక్కువ పాట పాడి అర్హత దక్కించుకున్న వారికి అదనపు కలెక్టర్ ఉత్తర్వులకు లోబడి ఉంటుందని, అదనపు కలెక్టర్ అనుమతి జారీ చేసిన 24 గంటల్లోపు పాటకు సంబంధించిన పైకం చెల్లించి సరుకు స్వాధీనం చేసుకోవచ్చన్నారు. వేలం ముందురోజు సరుకును పరిశీలించుకునేందుకు అనుమతించనున్నట్లు తెలిపారు. బహిరంగ వేలం తుది నిర్ణయం వేలం నిర్వహించిన అధికారికి ఉంటుందని, తనఖీల్లో స్వాధీనం చేసుకున్న పీడీఎస్ బియ్యం బెల్లంపల్లిలోని ఎంఎల్ఎస్ పాయింట్‌లో భద్రపర్చినట్లు తెలిపారు.


ట్రాక్టర్ బోల్తాపడి డ్రైవర్ మృతి

తాంసి: భీంపూర్ మండలం పిప్పల్‌కోటి గ్రామ శివారులో అతివేగంతో ట్రాక్టర్ అదుపుతప్పి బోల్తా పడగా ఘటన స్థలంలోనే డ్రైవర్ మృతి చెందాడు. వివరాలు.. తాంసి(కే) గ్రామానికి చెందిన వ్యక్తి మహారాష్ట్రకు చెందిన మనోజ్ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. ట్రాక్టర్‌లో శుక్రవారం పెన్‌గంగ నది నుంచి ఇసుక లోడ్‌ను ఇతర గ్రామానికి తీసుకెళ్లాడు. ఖాళీ ట్రాక్టర్‌ను తాంసి(కె) గ్రామానికి తీసుకెళ్లే క్రమంలో పిప్పల్‌కోటి, తాంసి(కె) గ్రామాల మధ్య అతివేగంగా వెళ్లడంతో ట్రాక్టర్ అదుపుతప్పి రోడ్డు పక్కన బోల్తాపడింది. ట్రాక్టర్ ఇంజిన్ కింద భాగంలో డ్రైవర్ మనోజ్‌కుమార్ (28) పడిపోవడంతో బయటకు వెళ్లరాని పరిస్థితి ఏర్పడింది. తీవ్ర గాయాలపాలైన ఈ ఘటన మృతిచెందాడు. పోలీసులకు స్థానికులు సమాచారం అందించగా ఘటన స్థలానికి చేరుకోని వివరాలు సేకరిస్తున్నారు.


కెమెరాకు చిక్కిన అటవీజంతువులు

ఖానాపూర్: మండలంలోని ఎక్బాల్‌పూర్‌తో పాటు వివిధ అటవీ బీట్‌ల పరిధిలో అటవీశాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన నీటి కుంటలు, సాసర్ ప్లాంట్ల వద్దకు వచ్చిన అటవీ జంతువులు అధికారులు ఏర్పాటు చేసిన కెమెరా ట్రాప్‌లలో చిక్కాయి. గత కొద్ది రోజులుగా అటవీ ప్రాంతంలో పెద్ద ఎత్తున దున్నల గుంపు సైతం తిరుగుతుందన్నారు. జంతువుల సంఖ్య పెరుగుతుండడం శుభసూచకమని, అటవీ శాఖ విధానాలు ఎంతో సత్ఫలితాలు ఇస్తున్నాయన్నారు. అడవి దున్నతో పాటు అడవి కుక్కలు, నీలుగాయిలు, ఎలుగుబంట్లు, జింకలు కెమెరా ట్రాప్‌లకు చిక్కిన వాటిలో ఉన్నాయి.

'కార్పొరేట్ల చేతిలో కేంద్రం కీలుబొమ్మ'


కరపత్రం ఆవిష్కరిస్తున్న నాయకులు

నిర్మల్‌చైన్‌గేట్: ప్రధాని నరేంద్రమోదీ ప్రభుత్వం కార్పొరేట్ శక్తుల చేతుల్లో కీలుబొమ్మగా మారిందని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి దుర్గం నూతన్‌కుమార్, జిల్లా అధ్యక్షుడు డాకూర్ తిరుపతి, రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి నాగేల్లి నర్సయ్య ఆరోపించారు. ఏప్రిల్ 5న నిర్వహించే 'చలో ఢిల్లీ' కార్యక్రమానికి సంబంధించి పట్టణంలోని ప్రజాసంఘాల ఐక్యవేదిక కార్యాలయంలో కరపత్రం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం, తెలంగాణ రైతు సంఘం, సీఐటీయూ ఆధ్వర్యంలో ఏప్రిల్ 5న 'చలో ఢిల్లీ' కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. విజయవంతం చేయాలని కోరారు.